క్లుప్తంగా

నేడు మహాలక్ష్మీ అలంకారం

రాయదుర్గం: జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో, అదేవిధంగా గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి అమ్మవార్లకు శనివారం మహాలక్ష్మీ అలంకారం చేస్తారు. అదేవిధంగా శివసాయిక్షేత్రంలో సామూహిక చండీ పారాయణం, చండీహోమం నిర్వహిస్తారు.

సాయిదత్త గణపతి ఆలయంలో ఉత్సవాలు

రాయదుర్గం: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని రెండురోజులపాటు ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు షిర్డీసాయిబాబా వారికి కాగడ హారతితో ఉత్సవాలను ఆరంభిస్తామన్నారు. అనంతరం షిర్డీసాయిబాబా, వినాయకుడు, దత్తాత్రేయ స్వామి ప్రత్యేక పంచామృతాభిషేకం నిర్వహిస్తామన్నారు. భక్తులతో సామూహికంగా సాయి అష్టోత్తరములు, విష్ణుసహస్రనామం, లలితాసహస్రనామం, సాయిగీతమాలిక, సాయి చాలీసా వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. అనంతరం మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ 24వ తేదీ వరకు ఆలయంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు జరిగే సాయి సచ్చరిత్ర పారాయణం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఇందులో పాల్గొనేవారు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు కోరారు.

ఉచిత గుండె పరీక్షలు

గచ్చిబౌలి: కండరాల క్షీణత (మస్క్యులర్ డిస్ట్రోఫీ)తో బాధపడే చిన్నారులకు ఉచితంగా గుండె పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం భారత్ ఎండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కండరాల క్షీణతతో బాధపడే వారికి ఉచితంగా ఈసీజీ, 2డి ఈకో, స్కానింగ్ తదితర గుండె పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో భారత్ ఎండి వ్యవస్థాపక డైరెక్టర్ రామలక్ష్మీ, కేర్ క్లీనికల్ డైరెక్టర్ డాక్టర్ కవిత చింతల, సీఓఓ డాక్టర్ సనీత్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు



మియాపూర్ : మియాపూర్ మయూరినగర్‌లోని గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, బ్యాంక్ ఉద్యోగినులు పూలతో బతుకమ్మను పేర్చి పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ.. సందడి చేశారు.

ఏడుగురికి జరిమానా..

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌లో ఏడుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి నలుగురికి ఒక్కొక్కరికీ రూ.2 వేల జరిమాన, ఒకరికి రూ.3 వేలు, ఇద్దరికి ఐదు వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

మలుపులు..ప్రమాదాలు



న్యూ హాఫీజ్‌పేట్ మలుపు వద్ద ..



యూటర్న్ వద్ద అడ్డదిడ్డంగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

హాఫీజ్‌పేట్ : నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సిగ్నళ్లను మూసివేసి యూ టర్న్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ నుంచి కొంతమేర ఉపశమనం కలిగినా యూ టర్న్‌లతో తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. చందానగర్, గంగారం, మదీనాగూడ వద్ద యూ టర్న్‌లతో నిత్యం ఉదయం, సాయంత్రం సమయాలలో ట్రాఫిక్ జామ్‌లతో ప్రజలు సతమతమవుతున్నారు. దీనికి తోడు సిగ్నళ్లు మూసివేసినప్పటి నుంచి పాదచారులు రోడ్డు దాటాలంటే ఇబ్బందులుపడుతున్నారు. ఆల్విన్ చౌరస్తా నుంచి హాఫీజ్‌పేట్, కొండాపూర్ వరకు ఉన్న యూటర్న్‌ల వల్ల ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. ఇక వర్షాకాలం గంటల తరబడి ప్రజలు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు.

- చందానగర్, గంగారంల వద్ద ఉన్న యూటర్న్‌లలో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ జాం తీవ్రంగా ఉన్నాయి
- జాతీయ రహదారి కావడంతో ప్రధానంగా భారీ వాహనాలు రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ కష్టాలు వర్ణణాతీతం
- పాదచారుల కోసం జీబ్రా క్రాసింగ్ సిగ్నల్‌ను ఏర్పాటు చేయాలి
- ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యామ్నయ రోడ్లను గుర్తించి వాహనాల రాకపోకలు మళ్లించాలి
- యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలి.

ట్రాఫిక్ పోలీసులు అవసరం



ఆల్విన్ చౌరస్తా నుంచి కొండాపూర్ వరకు ఉన్న రెండు యూటర్న్‌ల వద్ద ఉదయం, సాయంత్రం వేళలో ట్రాఫిక్ రద్దీగా ఉన్నప్పుడు పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. యూ టర్న్‌ల వద్ద ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలి.

– కృష్ణ యాదవ్, మార్తాండనగర్

రోడ్డు విస్తరించాలి...



హాఫీజ్‌పేట్ నుంచి కొత్తగూడ మీదుగా ఐటీ కారిడార్‌కు వెళ్ళే రోడ్డు రెండు లేన్లుగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ జాంలతో సతమతం అవుతున్నాం. ఇప్పుడు ఆ రోడ్డును ఆరు లేన్లుగా విస్తరిస్తే ట్రాఫిక్ సమస్యను అధిగమించవచ్చు. రోడ్డు పక్కనే ఉన్న చెట్లను కూడా బయోడైవర్సిటీ అధికారులు మరో చోటకు మార్చాలి.

– రాములు, ప్రేమ్‌నగర్

గోపన్‌పల్లిలో కాంగ్రెస్ ప్రచారం

రాయదుర్గం: కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో సంపూర్ణ విశ్వాసం ఉందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రఘునాథ్‌యాదవ్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గోపన్‌పల్లి, గోపన్‌పల్లితండా, ఎన్టీఆర్‌నగర్ ప్రాంతాలలో గడపగడపకూ రఘన్న కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇంటింటి ప్రచారం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి సార్థకత కలుగుతుందన్నారు. అంతకు ముందు గోపన్‌పల్లితండా సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సనాసుల్తానాకు పీహెచ్‌డీ ప్రదానం

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థి సనాసుల్తానాకు శుక్రవారం పీహెచ్‌డీ డిగ్రీ ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో కామర్స్ విభాగంలో ఆమె 'హౌసింగ్ ఫైనాన్స్ వైపు రుణ గ్రహీతల అవగాహన–కాన్ఫిన్‌హోమ్స్, ఐసీఐసీఐ యొక్క తులనాత్మక అధ్యయనం' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. ఆమె 'మనూ' లోని వాణిజ్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎండి సదత్‌షరీఫ్ పర్యవేక్షణలో పీహెచ్‌డీని పూర్తి చేశారు. ఆమెను పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

బీఆర్‌యస్ కార్యకర్తల సమావేశం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్ వెస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, బీఆర్‌యస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఎన్నికల కార్యాచరణపై కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ చర్చించారు.







దేవీ.. నమోస్తుతే

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఒడిసి, కూచిపూడి నృత్యప్రదర్శనలు అలరించాయి. కోల్‌కత్తాకు చెందిన కళాకారులు శ్వేతకందు, అనుష్కరాయ్, సంపూర్ణరాయ్, శ్రీచక్రబర్తి, తీస్తా సర్కార్ లు జగన్నాథ్ వందన, మంగళచరణ్, బసంత్ పల్లవి , దశావతారాలు, మోక్ష అంశాలను కళాకారులు ఒడిసి నృత్యరూపంలో ప్రదర్శించి అలరించారు. కందుల కూచిపూడి నాట్యాలయం గురువు రవి కూచిపూడి శిష్యబృందం దేవి వైభవం నృత్యరూపకం ప్రదర్శించారు. కళాకారులు శాన్వి, మణిమాల, వర్షన ప్రియ, హంసిని, సురుచి, లాస్యప్రియ, మధులిక తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లపై కసరత్తు

పోస్టల్ బ్యాలెట్లకు ప్రత్యేక టేబుల్



ప్లాన్‌ను పరిశీలిస్తున్న శేరిలింగంపల్లి రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రక్రియపై కసరత్తు చేస్తున్నారు. గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ అధికారులు కౌంటింగ్ కేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బంది, అధికారులు, ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు కూర్చోవడం తదితర అంశాలపై ప్రణాళిక రూపొందించారు. 14 రౌండ్ల కోసం 28 టేబుళ్లను వాడనున్నారు. ఓట్ల బ్యాలెట్ కోసం ప్రత్యేకంగా టేబుళ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ కోసం చేసే ఏర్పాట్ల నమూనాను 52–శేరిలింగంపల్లి నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్ బి.శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు.

స్ట్రాంగ్ రూమ్ రెడీ...

గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్‌ను రెడీ చేశారు. నియోజకవర్గానికి కేటాయించిన ఈవీఎంలను త్వరలో అప్పగిస్తారని, స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తామని రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న శ్యామలాదేవి

మియాపూర్ : కారు గుర్తుకు ఓటువేసి శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి శ్యామలాదేవి పిలుపునిచ్చారు. చందానగర్ డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య కాలనీ, సాయినగర్, కృష్ణ దేవరాయకాలనీ, ఫ్రెండ్స్ కాలనీలో కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి..

హాఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆరికెపూడి గాంధీని ముచ్చటగా మూడవ సారి భారీ మెజార్టీతో గెలిపించాలని గాంధీ సతీమణి శ్యామలదేవి కోరారు. శుక్రవారం చందానగర్‌లోని విశ్వేశ్వరయ్య కాలనీ, సాయినగర్, కృష్ణదేవరయ్య కాలనీ, ఫ్రెండ్స్ కాలనీలలో స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆమె ఇంటింటికి తిరుగుతూ బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకురాలు గుడ్ల ధనలక్ష్మి, వరలక్ష్మి, చంద్రిక ప్రసాద్, మాధవి, పృథ్వీ, రాధిక, ప్రణీత, భవాని, కుమార్, సునీత, మీనా, హరిత తదితరులు పాల్గొన్నారు.

కారు దిగిన బండి రమేష్

- రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బండి రమేష్

గచ్చిబౌలి: బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్ రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో జగిత్యాల పర్యటనలో ఉన్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ కండువా కప్పి బండి రమేష్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. శేరిలింగంపల్లిలో 2009లో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగి 30.266 ఓట్లు సాధించి టీడీపీ అభ్యర్థి మొవ్వా సత్యనారాయణ ఓటమిని శాసించారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ టికెట్ కోసం ప్రయత్నం చేయగా సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకే బీఆర్‌ఎస్ అధిష్టానం మొగ్గు చూపింది. దీంతో అసంతృప్తిగా ఉన్న బండి రమేష్ కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నించారు. శేరిలింగంపల్లిలో బీఆర్‌ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. మొన్న జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ జగదీశ్వర్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. కొద్దిరోజుల్లోనే మరో నేత బండి రమేష్ పార్టీని వీడటంతో శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్‌లో కలకలం రేపుతోంది.

చందానగర్‌లో 3.10 లక్షలు సీజ్

హాఫీజ్‌పేట్ : చందానగర్ ప్రధానరోడ్డుపై సరైన పత్రాలు లేకుండా జవహర్ కాలనీకి చెందిన మహ్మద్ హుస్సేన్ తరలిస్తున్న రూ.3.10 లక్షలను ఎస్‌ఓటీ, చందానగర్ పోలీసులు గుర్తించారు. డబ్బుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం సీజ్ చేసిన డబ్బును ఎన్నికల అధికారులకు అప్పగిస్తున్నట్లు సీఐ పాలవెల్లి తెలిపారు.





సరస్వతీమాతగా అమ్మవారు

రాయదుర్గం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గచ్చిబౌలిలోని జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం రాజరాజేశ్వరీమాత సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



రాయదుర్గంలో.. సరస్వతీ పూజలో చిన్నారులు



ఖాజాగూడ వీకర్‌సెక్షన్ కాలనీలో..



జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లో.. సరస్వతీదేవిగా రాజరాజేశ్వరిమాత



శివసాయిక్షేత్రంలో చండీహోమం

బహుముఖ ప్రజ్ఞాశాలి గుంటూరు శేషేంద్రశర్మ



హెచ్‌సీయూలో సదస్సులో పాల్గొన్న అతిథులు, ఆచార్యులు

తెలుగు అకాడమీ పూర్వసంచాలకులు ఆచార్య యాదగిరి

రాయదుర్గం: బహుముఖ ప్రజ్ఞాశాలి గుంటూరు శేషేంద్రశర్మ అని తెలుగు అకాడమీ పూర్వ సంచాలకులు ఆచార్య కే యాదగిరి అభివర్ణించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ప్రముఖ కవి గుంటూరు శేషేంద్రశర్మ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం 'గుంటూరు శేషేంద్రశర్మ రచనలు–సమాలోచనలు' అనే అంశంపై హెచ్‌సీయూ మానవీయ శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ డీన్ ఆచార్య వి కృష్ణ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న యాదగిరి మాట్లాడుతూ భావం, అభ్యుదయ కవిత్వ అపూర్వ సమ్మేళనం శేషేంద్రశర్మ రచనల్లో కనిపిస్తుందన్నారు. ఆచార్య వి కృష్ణ మాట్లాడుతూ సాహిత్యం ప్రజల కోసం అని నమ్మిన అతి కొద్దిమంది సాహితీవేత్తలలో గుంటూరు శేషేంద్రశర్మ ఒకరన్నారు. సదస్సు సమన్వయకర్త ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆయన తెలుగు సాహిత్యాన్ని విశేషంగా ప్రభావితం చేశారన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిరి, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఓరియంటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ఆచార్య పిసి వెంకటేశ్వర్లు, యోగివేమన యూనివర్శిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్ ఈశ్వర్‌రెడ్డి, సదాశివపేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ తాడేపల్లి పతంజలి,డాక్టర్ భారతి, ఆచార్యులు పిల్లలమర్రి రాములు, గోనానయక్, భుక్యతిరుపతి, పమ్మి పవన్‌కుమార్, ఎంఏ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశం

హాఫీజ్‌పేట్ : హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు గాంధీకి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. . మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గౌతమ్‌గౌడ్, వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్, దాత్రి గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ



